సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం | 28 | నవంబర్ | 2023

కార్తీకం..శుభప్రదం

నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో సోమవారం కృతిక నక్షత్రంతో కూడిన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహించారు. భక్తులు ఆవునెయ్యితో దీపాలు వెలిగించారు. కలశం, స్వస్తిక్, ఓం, పద్మం, త్రిశూలం, చతురస్రం, నెమలి, హంస, శివలింగాకారం తదితర రూపాల్లో దీపాలు వెలిగించారు.

- హన్మకొండ కల్చరల్



సకల జనులకు | సముచిత స్థానం

గిరిజనులు, ఆదివాసీలకు బీజేపీ ప్రాధాన్యం

- కురవి వీరభద్రుడి ఆశీస్సులు కోరుతున్నా
- తెలంగాణ ప్రజలు కమలం వైపు చూస్తున్నారు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- మానుకోట సకల జనుల విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ
- తెలుగులో ప్రసంగం ప్రారంభం.. పార్టీ శ్రేణుల్లో జోష్
- ఒక్క చాన్స్ ఇస్తే మార్పు చూపిస్తా: హుస్సేన్‌నాయక్



మానుకోటలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, మహబూబాబాద్/ మహబూబాబాద్/ మహబూబాబాద్ అర్బన్: 'నా తెలంగాణ కుటుంబ సభ్యులకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు. కురవి వీరభద్ర స్వామి మందిరానికి శ్రద్ధాపూర్వక నమస్కారాలు.. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తీసుకున్నాను. ఈ ప్రాంతం, రాష్ట్ర ప్రజలు బాగుండాలని కోరుకుని ఇక్కడికి వచ్చా.. ప్రజలు జనతా జనార్దనులు, ఈశ్వర సమానులు.. సభకు మీరందరూ రావడం సతోషం.. ఇక్కడ నూతన శకం ప్రారంభం కానుంది.. మహబూబాబాద్ ప్రాంతానికి సేవాలాల్ మహరాజ్ సమర్పణ తపస్సు ఫలం లభించింది.. సేవాలాల్ మహరాజ్‌కీ జై..' అంటూ దేశ ప్రధాని నరేంద్రమోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించి ప్రజలను ఉత్తేజ పరిచారు. బీజేపీ అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోందని, సకల జనులకు సముచిత స్థానం లభిస్తోందని అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సకల జనుల విజయ సంకల్ప సభ నిర్వహించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్ నాయక్‌తోపాటు డోర్నకల్, నర్సంపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అభ్యర్థులు భూక్య సంగీత, పుల్లారావు, రవీంద్రనాయక్, బాలరాజు, కుంజ ధర్మాను బలపరుస్తూ సభకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. సభకు ప్రధాని మోదీ హాజరై బీజేపీ ప్రభుత్వాన్ని బలపర్చాలని, అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించా. పలువురు ప్రముఖులతో మాట్లాడా. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు' అని అన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని, తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. నవంబర్ 30వ తేదీన ప్రజలువేసే ఓట్లతో ముఖ్యమంత్రి ఓడిపోతున్నారన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపించేది బీజేపీ ప్రభుత్వం ఒక్కటే అన్నారు. సభలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, రాజవర్ధన్‌రెడ్డి, ఎడ్ల అశోక్ రెడ్డి, రవీంద్ర నాయక్, బాలరాజు, ధర్మారావు, ప్రేమేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంచంద్రు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



వేదికపై అభివాదం చేస్తున్న నరేంద్ర మోదీ, పక్కన అభ్యర్థులు హుస్సేన్‌నాయక్, సంగీత తదితరులు

అవకాశం ఇస్తే మార్పు చేసి చూపిస్తా: హుస్సేన్ నాయక్



ఒక్కసారి తనకు అవకాశం కల్పిస్తే మానుకోట నియోజకవర్గం మార్పు చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో దోపిడీ, అరాచకాలు పెరిగాయని, దీంతోపాటు భూకబ్జాలు జరిగాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత పీఎం మోదీది అన్నారు.

బీఆర్ఎస్ అరాచక పాలనకు చరమగీతం పాడాలి: భూక్య సంగీత



డోర్నకల్ నియోజకవర్గంలో రెడ్యానాయక్ కుటుంబ పాలన సాగుతోందని బీజేపీ అభ్యర్థి భూక్య సంగీత అన్నారు. రెడ్యానాయక్ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. 40 ఏళ్ల ప్రజా ప్రతినిధిగా ఉన్న రెడ్యానాయక్ డోర్నకల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. రెండు సార్లు జెడ్పీటీసీగా గెలిపించిన మీరు ఈ సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

సైడ్‌లైట్స్..

- ప్రధాని మోదీ మానుకోట సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12.49 గంటలకు చేరుకోగా 12.51కి హెలికాప్టర్ ల్యాండ్ అయింది.
- మధ్యాహ్నం 1.02 గంటలకు మోదీ వేదిక పైకి చేరుకున్నారు. 1.13 నుంచి 1.50 గంటల వరకు ప్రసంగించారు.
- ఇప్పటివరకు మానుకోటకు పీఎం హోదాలో మోదీ మాత్రమే వచ్చారు. గతంలో ఇందిరాగాంధీ వచ్చినప్పటికీ ఆమె అప్పుడు పీఎం హోదాలో లేరు.
- మోదీ రాకతో భారత్‌మాతాకీ జై, జైశ్రీరాం నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.
- వేదికపై మొదట బీజేపీ డోర్నకల్ అభ్యర్థి సంగీత పీఎం మోదీకి శాలువా కప్పి సన్మానించి నమస్కరించారు. ఆమెకు పీఎం తిరిగి నమస్కరించారు. తర్వాత మానుకోట అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ కూడా మోదీని శాలువాతో సత్కరించి శ్రీరాముడి చిత్రపటం బహూకరించారు.
- చాలామంది వ్యాపారులు, మార్వాడీలు దుకాణాలను బంద్ చేసి కటుంబసభ్యులతో కలిసి మోదీ సభకు తరలివచ్చారు.
- పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు కూడా పీఎంను చూడడానికి రావడం గమనార్హం.

జంగ్ తెలంగాణ

ప్రచారం.. నేటితో పరిసమాప్తం

సాయంత్రం 5 గంటల తర్వాత మైక్‌లు బంద్

- వివరాలు 6లో

కాంగ్రెస్‌తో ఇందిరమ్మ రాజ్యం



మరిపెడలో జరిగిన విజయభేరి సభకు హాజరైన జనం



సభలో అభ్యర్థి రాంచంద్రునాయక్‌ను పరిచయం చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

అక్కడ కేసీఆర్.. ఇక్కడ రెడ్యానాయక్

- ఇద్దరి పీడ విరగడవ్వాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి
- కృష్ణా జలాలతో డోర్నకల్ ప్రాంతం సస్యశ్యామలం చేస్తాం
- మరిపెడ విజయభేరి సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

మరిపెడ/ మరిపెడ రూరల్: రాష్ట్రానికి కేసీఆర్.. డోర్నకల్ నియోజకవర్గానికి రెడ్యానాయక్ పీడ ఈ ఎన్నికలతో విరగడవుతుందని.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇందిరమ్మ రాజ్యమని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి రాంచంద్రునాయక్ గెలుపుకోసం మరిపెడలో సోమవారం నిర్వహించిన విజయభేరి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి వద్దకు ఉద్యోగం కోసం వస్తే సర్పంచ్, సమితి ప్రెసిడెంట్, ఎమ్మెల్యే, మంత్రి వరకు కాంగ్రెస్ పార్టీ పదవులు ఇస్తే వాటిని విస్మరించిన.. విశ్వాసం లేని నాయకుడు రెడ్యానాయక్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరుసార్లు కాంగ్రెస్ నుంచి గెలిచి ఈ ప్రాంత ప్రజలను మోసంచేసి స్వలాభం కోసం బీఆర్ఎస్‌లో చేరలేదా అని ప్రశ్నించారు. అక్కడ కేసీఆర్ కుటుంబం చాటలు పట్టుకొని పంచుకుంటుంటే.. ఇక్కడ రెడ్యానాయక్ కుటుంబ సభ్యులు చాటలు పట్టుకొని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, బియ్యం దందాలు ఇలా అన్నింటిలో రెడ్యా కుటుంబం పాత్ర ఉందని ఆరోపించారు.

కృష్ణా జలాలతో సస్యశ్యామలం

తలాపున కృష్ణా నది ఉన్నా సాగునీటికి డోర్నకల్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు కృష్ణా జలాలను అందించి సాగునీటి ఇబ్బంది తీరుస్తామని అన్నారు. ఇక్కడి ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి మార్గాలు లేవని అన్నారు. రాంచంద్రునాయక్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి జరిగేలా చూస్తానన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో బడులకు పోవాల్సిన యువకులు ఒక చేత బీఆర్ఎస్ జెండా, మరోచేత బీరు సీసాలతో తిరుగుతున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో మద్యం ఏరులై పారుతుందన్నారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా రాంచంద్రునాయక్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మురళీనాయక్, నూకల శ్రీరంగారెడ్డి, నెహ్రూనాయక్, మరిపెడ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, యుగేందర్‌రెడ్డి, అంబరీష, అప్సర్, ముదిరెడ్డి నరేష్‌రెడ్డి, కమలాకర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

సేవ చేసే భాగ్యం కల్పించాలి : కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి రాంచంద్రునాయక్



'నేను డాక్టర్‌గా స్థిరపడ్డా.. డోర్నకల్ ప్రజలపై అభిమానంతో రెండు పర్యాయాలు రెడ్యానాయక్‌పై పోటీ చేశా' అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంచంద్రునాయక్ అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మరిపెడలోనే ఆస్పత్రి కట్టించి, నేను, నా భార్య ఇక్కడి ప్రజలకు సేవ చేస్తామన్నారు. మీకు సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు.

కల్లబొల్లి మాటలు నమ్మొద్దు..





ఏటూరునాగారంలో జరిగిన రోడ్‌షోకు హాజరైన జనం, మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి బడే నాగజ్యోతి, మంత్రి సత్యవతి రాథోడ్

- తల్లికి బువ్వ పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అంటే ఎలా?
- కాంగ్రెస్ పార్టీవి మోసపూరిత వాగ్దానాలు
- గత ఎన్నికల్లో ఓడిపోయినా ములుగుపై ప్రేమతో జిల్లా ఏర్పాటు
- బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని గెలిపిస్తే మరింత అభివృద్ధి
- ఏటూరునాగారం రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

ఏటూరునాగారం: 'తల్లికి బువ్వ పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అంటే ఎలా? కాంగ్రెస్ నాయకులు మోసపూరితమైన వాగ్దానాలు చేస్తున్నారని, వారి కల్లబొల్లి మాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి, ఆదివాసీ ముద్దు బిడ్డ బడే నాగజ్యోతిని భారీ మెజారిటీతో గెలిపించి ములుగు నియోజకవర్గ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాగజ్యోతిని గెలిపిస్తేనే ములుగు అభివృద్ధికి మరింత కృషి చేస్తామని, లేకపోతే లేదన్నారు. 'ముళ్ల చెట్టుకు నీళ్లు పోసి పండ్లు రావాలంటే వస్తాయా..? యుద్ధంలో కత్తి వేరే వారికి ఇచ్చి ఒట్టి చేతులతో మమ్ములను కదనరంగంలో దూకమంటే ఎలా? రైతుల నోటికాడి బుక్క ఆగం చేసింది రేవంత్‌రెడ్డి కాదా? రైతుబంధు ఆపిన ద్రోహి రేవంత్‌రెడ్డి కాదా' అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సీతక్క తల్లిదండ్రులకు సైతం పోడు భూముల పట్టా ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని ఓడించినా ములుగు నియోజకవర్గంపై ప్రేమతో ప్రజల సంక్షేమం కోసం జిల్లా ఏర్పాటు చేశామని, మెడికల్ కాలేజీ, 200 పడకల ఆస్పత్రి వస్తుందన్నారు. మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తూ, ఏటూరునాగారం అటవీ ప్రాంత ప్రజల బాగోగులు చూసుకునేందుకు రెవెన్యూ డివిజన్, డయాలసిస్ సెంటర్, తలసేమియా వ్యాధి నిర్మూలనకు కృషి చేశామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వృద్ధులు, వితంతువులకు ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా, దళితుల అభివృద్ధికి ప్రత్యేక దళితబంధు పథకాలు అమలు చేశామన్నారు. ఈసారి ప్రభుత్వం ఏర్పాటైన తక్షణమే గిరిజనులకు గిరిజన బంధు, ఆదివాసీల ఆరాధ్య దైవాలైన సమ్మక్క- సారలమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తేవడంలో కేసీఆర్ పాత్ర ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలతో ఓటు పొందాలని అత్యాశపడుతున్నారని, కాంగ్రెస్, బీజేపీకి ఓటు ద్వారా ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ధరణి తీసి దళారీ వ్యవస్థ తెస్తాడటా?

కేసీఆర్ పెట్టిన ధరణితో ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఒక్కరోజులో భూమి రిజిస్ట్రేషన్, మార్పులు, చేర్పులు అవుతున్నాయని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్క మాత్రం ధరణి తీసివేసి మళ్లీ దళారీ వ్యవస్థ, పట్వారీ, లంచాల వ్యవస్థ తెస్తామంటున్నారని, అదే జరిగితే మళ్లీ రైతులు అరిగోస పడతారన్నారు. ఇలాంటి వాళ్ల పాలన మనకు అవసరం లేదన్నారు. దొడ్డు బియ్యం ఇస్తే అవి రూ.15కు పక్కదారి పడుతున్నాయని, పేదల కోసం అన్నపూర్ణ పథకం కింద సన్న బియ్యం ఇస్తామన్నారు. కోడళ్లకు సౌభాగ్యలక్ష్మి పథకం పేరుతో రూ.3వేలు ఇస్తామన్నారు. రూ.400కు గ్యాస్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, స్థానిక ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, ఎంపీటీసీలు కోట నర్సింహులు, జాడి లక్ష్మీనారాయణ, దివంగత జెడ్పీ చైర్మన్ జగదీష్ భార్య రమాదేవి, సప్పిడి రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించాలి : బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి



ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి ప్రజలను వేడుకున్నారు. సీఎం కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పేదింటి బిడ్డను నన్ను గెలిపిస్తే మీవెన్నంటే ఉంటూ సేవ చేసుకుంటానన్నారు. కొండాయి బ్రిడ్జి, కరకట్ట నిర్మాణం, ఇతర సమస్యలను కేటీఆర్‌కు వివరించానన్నారు. 30వ తేదీన మూడో నంబర్‌లో ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



మానుకోటలో జరిగిన సకల జనుల విజయసంకల్ప సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ





ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్, నృత్యం చేస్తున్న కళాకారులు



మరిపెడ కాంగ్రెస్ విజయభేరి సభలో నృత్యం చేస్తున్న గిరిజనులు

ప్రచార హోరు..

తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రచారం హోరెత్తింది. మూడు ప్రధాన పార్టీల నుంచి అగ్ర నాయకులు హాజరుకావడంతో ప్రచారం ఉధృతంగా సాగింది. మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో రాష్ట్ర మంత్రి కేటీఆర్, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. - సాక్షి నెట్‌వర్క్

మేనిఫెస్టోలపై మిశ్రమ స్పందన

మడికొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తమ మేనిఫెస్టోలు ప్రకటించాయి. అలాగే, మేనిఫెస్టోలో పొందుపర్చని పలు అంశాలకు సంబంధించి హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేనిఫెస్టో, హామీల విషయంలో ఐటీ ఉద్యోగుల ఇలా స్పందించారు. గెలిచిన తర్వాత హామీల అమలులో జాప్యం చేయొద్దు.. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. చదువుకునేందుకు ఆర్థిక సాయం చేయాలి.



యువత భవిష్యత్‌కు బీజేపీ భరోసా..



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో బాగుంది. డిగ్రీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, గ్రూప్–1, గ్రూప్–2 సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను ఆరు నెలల్లో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. యువత భవిష్యత్ కోసం ఇతర పార్టీలు తమ మేనిఫెస్టోలో పెద్దగా ఏ అంశాలు పొందుపర్చలేదు. - దార ధనుంజయ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సైయంట్

యువతకు పెద్దగా హామీలు లేవు



యువత కోసం వివిధ పార్టీలు పెద్దగా ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం యువతను విస్మరించింది. విద్యార్థులు, యువకులకు ఎలాంటి హామీలు ఇవ్వలేదు. కేవలం ఆసరా పింఛన్లు, రైతుబంధు పై ఉన్న ప్రీతి నిరుద్యోగ యువకులపై లేదు. - ప్రవీణ్ ఐటీ ఉద్యోగి, సైయంట్

కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ బాగుంది



కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన జాబ్ క్యాలెండర్ బాగుంది. యువత, నిరుద్యోగులకు ఒక భరోసా కల్పించేలా ఉంది. అలాగే, యువవికాసం పథకం కింద విద్యా భరోసా కార్డు ద్వారా రూ. 5 లక్షలు అందజేయడం బాగుంది. ఈ పథకం వల్ల విద్యార్థులకు చదువులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. - సాయితేజ, ఐటీ ఉద్యోగి

ఈ ముచ్చటెరికేనా?

పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లే..



కాజీపేట: ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయి. ఇందులో ప్రధానంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ ఒకదానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ఇందులో ఈవీఎంల పాత్ర కీలకం. ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు. ఈ సంఖ్యను ఎందుకు పరిమితం చేస్తారంటే.. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానించే ఉండే వీవీప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1500 స్లిప్‌లను మాత్రమే ముద్రించగలుగుతుంది. 25.5 ఓల్ట్‌ల బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లో ఓటు ఎవరికి వేసిందనే విషయం డిస్‌ప్లేలో కనిపిస్తుంది. ఇది ఏడు సెకండ్లు మాత్రమే ఓటరుకు కనిపిస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్‌లు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియకు ఖర్చు అవుతాయి. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.

ప్రచారం.. నేటితో పరిసమాప్తం!

సాయంత్రం 5 గంటల తర్వాత మూగనోమే..

- ఒక్కరోజు ముందుగానే పోటెత్తిన అగ్రనేతలు
- ప్రధాని మోదీ, రేవంత్ రెడ్డి, కేటీఆర్, అసోం సీఎం తదితరులు
- నేడు వరంగల్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్



వరంగల్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ కోసం సిద్ధమవుతున్న వేదిక

సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఎన్నికల నోటిఫికేషన్‌నుంచే అభ్యర్థులు ప్రచారం చేస్తున్నా.. ఈ నెల 15న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రచారం ఊపందుకుంది. 20వ తేదీ నుంచి ఉమ్మడి వరంగల్‌కు అగ్రనేతలు వరుసకట్టడంతో ప్రచారం పతాకస్థాయికి చేరింది. అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన పార్టీల క్యాంపెయినర్లు, అగ్రనేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు చెమటోడ్చారు. రోజూ నేతల రోడ్‌షోలు, సమావేశాలు, మైక్‌ల మోతలతో ఉమ్మడి జిల్లా హోరెత్తింది. ప్రచారం ముగింపునకు ఒక్కరోజు ముందుగానే అగ్రనేతలు పోటెత్తారు. సోమవారం భారత ప్రధాని నరేంద్రమోదీ మహబూబాబాద్‌లో, అసోం సీఎం హిమంత బిశ్వశర్మ పరకాలలో, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, డోర్నకల్ నియోజకవర్గంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఏటూరు నాగారంలో రోడ్‌షోలు, సభలు నిర్వహించారు. ప్రముఖుల రాకతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. సుమారు 13 రోజులపాటు ఉధృతంగా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు పరిసమాప్తం కానుంది. చివరి రోజు మంగళవారం న ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో ప్రచారం ముగింపు తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు వ్యూహరచనలో నిమగ్నం కానున్నారు. నోటిఫికేషన్ తర్వాత విస్తృతంగా నియోజకవర్గాల్లో పర్యటించినప్పటికీ ప్రతికూల పరిస్థితులున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పోల్ మేనేజ్‌మెంట్‌పై నజర్ పెట్టిన ప్రధాన పార్టీలు ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాలు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

మద్యం షాపులు మూడు రోజులు బంద్

కాజీపేట అర్బన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు రోజులు మద్యం షాపులు బంద్ చేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

పోల్ మేనేజ్‌మెంట్ వైపు చూపు

హన్మకొండ: ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ వైపు దృష్టి సారించారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియనుంది. దీంతో అభ్యర్థులు ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రూట్ మార్చారు. ఇప్పటి వరకు ప్రచార రథాలతో హోరెత్తించడంతోపాటు గ్రామాలు, కాలనీల్లో పాదయాత్ర చేశారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ఓటర్లను తమ వైపు ఆకర్షించేందుకు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు ఇక ఓటర్లను మరింతగా ప్రసన్నం చేసుకునేందుకు పోల్ మేజ్‌జిమెంట్‌కు కొందరు రంగంలోకి దిగగా, మరి కొందరు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల ద్వారా కొందరు అభ్యర్థులు ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించారు. కుల, వృత్తులు, కార్మికులు, ఉద్యోగులు, ఇతర కమ్యూనిటీల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనాల్లోను కొంత సొమ్ము ముట్టజెప్పారని ప్రచారం జరుగుతోంది.

గంపగుత్తగా ఓట్ల కోసం..

ఎన్నికలకు రెండు రోజుల గడువు మాత్రమే ఉండడంతో అభ్యర్థులు, వారి అనుచరులు పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల లెక్కలు తీస్తున్నారు. గంపగుత్తగా, సింగిల్‌గా ఓట్లు రాబట్టుకునేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌స్థాయిలో విందులు ఇస్తున్నారు. మరో వైపు పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పార్టీలు, అభ్యర్థులు ఒకరిని మించి మరొకరు ఎత్తుకు పైఎత్తు వేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఒకరు ఓటుకు రూ.వేయి ఇస్తే మరొకరు రూ.1500, ఒకరు రూ.1500 ఇస్తే మరొకరు రూ.2 వేలు, ఇలా రూ.5 నుంచి రూ.6 వేలకు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కార్యకర్తల్లో చర్చ సాగుతోంది. ఏదేమైనా ఓట్లు రాబట్టుకుని విజయం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ పక్కగా సాగేందుకు అభ్యర్థులు ప్రణాళికతో ముందుకు పోతున్నారు.

భారీగా మద్యం పట్టివేత



మద్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్ క్రైం: ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు భారీ మొత్తంలో మద్యం తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం కాకోజీ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కారు ఆపకుండా వెళ్లింది. పోలీసులు వెంబడించి కారును పట్టుకోగా అందులో రూ.50,880 విలువైన మద్యం లభించింది. దీనిపై విచారించగా ఎన్నికలలో పంపిణీ చేసేందుకు మద్యం తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులు హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన మేరుగు లింగమూర్తి, సంగెం మండలం కొత్తగూడేనికి చెందిన వాసం రాములను అదుపులోకి తీసుకొని సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాంబాబు, ఎస్సై శరత్‌కుమార్, సిబ్బంది అశోక్, రాజు, నరేష్, సాంబరాజు, సుబేదారి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్ : ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. ఏనుమాముల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూంలు, మీడియా సెంటర్లను సోమవారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. కౌంటింగ్ రూం, స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, వీడియోగ్రఫీ, పటిష్ట భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీఓలు రమేష్, శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి పై కేసు



ప్రచార వాహనం పై ముద్రించిన ప్రకటనలు

వరంగల్ క్రైం: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అనుచరులకు సహాయపడిన పోలీస్ అధికారులు అని వాహనం పై తప్పుడు ప్రకటనలు ముద్రించి ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గుర్రం జక్కయ్య పై హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జ్ కందుకూరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముచ్చటగా మూడోసారి గెలుస్తా..

90 శాతం హామీలు నెరవేర్చా

- దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ
- మడికొండ ఐటీపార్కుతో యువతకు ఉపాధి అవకాశాలు
- నాకు ప్రత్యర్థి ఎవరూ లేరు.. గతం కన్నా మెజార్టీ ఎక్కువ వస్తుంది
- 'సాక్షి'తో బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్



సాక్షి, వరంగల్ : 'బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సారథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గలో అనేక అభివృద్ధి పనులు చేశాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలే నా ప్రచారాస్త్రాలు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఎదురే లేదు. ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తా. నాకు ప్రత్యర్థి ఎవరూ లేరు. గతం కంటే ఈసారి మెజారిటీ ఎక్కువగానే వస్తుంది' అని అంటున్నారు బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పేదలకు అండగా నిలిచాం..

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.72,185 కోట్ల రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదలకు అండగా నిలిచాం. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు పథకాలు అర్హులకు అందిస్తా. ఈ పథకాలన్నీ నిరంతర ప్రక్రియ.

రూ.4,354 కోట్లతో అభివృద్ధి..

వర్ధన్నపేటను రూ.4,354 కోట్లతో అభివృద్ధి చేశా. 90 శాతం హామీలను నెరవేర్చా. ఇంకా మిగిలిన అభివృద్ధి పనులను తిరిగి అధికారంలోకి వచ్చాక పూర్తిచేస్తా. గ్రేటర్ వరంగల్‌లో విలీనమైన 31 గ్రామాల అభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు తీసుకొచ్చా. వర్ధన్నపేటను మునిసిపాలిటీగా చేసి రూ.164 కోట్లతో అభివృద్ధి చేశా. ఆకేరు వాగుపై బ్రిడ్జి కం చెక్ డ్యాం నిర్మించాం. రవాణా సౌకర్యాలు కల్పించా. హసన్‌పర్తి పెద్ద చెరువుపై రూ.ఐదు కోట్లతో మినీ ట్యాంకుబండ్ అభివృద్ధి చేశా.

సీహెచ్‌సీ అప్‌గ్రేడ్..

వర్ధన్నపేటలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్ సీ)ను రూ.26 కోట్లతో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తాం. ఇందుకోసం టెండర్ కూడా అయింది. ఎన్నికల కోడ్‌తో పనులు ఆగిపోయాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. కోనారెడ్డి చెరువును రూ.14 కోట్లతో మరమ్మతులు చేశాం. జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.14.5 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మళ్లీ గెలవగానే పనులు ముందుకు తీసుకెళ్తా.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా...

ఐటీకి కేరాఫ్‌గా మడికొండను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే అనేక కంపెనీలు వచ్చాయి. భవిష్యత్‌లో వచ్చే కంపెనీలతో యువతకు మరిన్ని ఉద్యోగాలు రానున్నాయి. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి మహిళలు, యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తాం. అలాగే, అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తా. ప్రైవేట్ రంగంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి జాబ్‌మేళాలు నిర్వహిస్తా.

మామునూరు ఎయిర్‌పోర్టుకు మా నుంచి క్లియర్..

ఎయిర్‌పోర్టు అథారిటీ అడిగిన మేరకు 400 ఎకరాలకుపైగా భూమి సమీకరించి అప్పగించాం. రాష్ట్ర ప్రభుత్వపరంగా అన్ని పనులు పూర్తి చేశాం. కేంద్రం నిర్ణయం తీసుకుంటే ఇక్కడా పనులు మొదలవుతాయి. అలాగే, మడికొండలోని డంపింగ్‌యార్డు తొలగిస్తా. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో జర్మనీ కంపెనీ ఆధ్వర్యంలో అక్కడ చెరువు సుందరీకరణ పనులు ఫైనల్ అయ్యాయి.

మాది ప్రజామేనిఫెస్టో..

బీఆర్ఎస్ మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. ఆసరా పింఛన్‌దారులకు రూ.5 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించనున్నాం. రైతు బంధు రూ.16 వేలకు పెంచుతాం. పేదలకు రూ.ఐదు లక్షల కేసీఆర్ బీమా, రూ.15 లక్షలకు వరకు ఆరోగ్యరక్ష వంటి పథకాలు అధికారంలోకి రాగానే అమలు చేస్తాం.

8 నుంచి ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కేయూ రిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎంసీఏ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు (నాన్ సీబీసీఎస్, ఎక్స్ విద్యార్థులకు) డిసెంబర్ 8 నుంచి నిర్వహించనున్నట్లు ఎరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

పత్రిక ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

హన్మకొండ అర్బన్: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 29, 30న ప్రతికల్లో ప్రకటనల జారీ కోసం ముందస్తుగా జిల్లా కేంద్రంలోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలులేదని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల సర్వే వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం నిషేధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య

వరంగల్ అర్బన్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. వరంగల్ ఎల్‌బీ కళాశాల ఆడిటోరియంలో ఆర్‌ఓలు షేక్ రిజ్వాన్‌బాషా, అశ్వినితానాజీవాకడే, కృష్ణవేణితో కలిసి సెక్టోరల్ అధికారులకు పోలింగ్‌పై కలెక్టర్ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కనీసం మూడుసార్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి సదుపాయాలు పరిశీలించాలని సూచించారు. ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు డీఆర్డీఓ సంపత్‌రావు, వాసంతి, బాలకష్ణ, పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

కరీమాబాద్: ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూ, సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులు షణ్ముగరాజన్, రాజేష్‌కుమార్, అమిత్ ప్రతాప్‌సింగ్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

శాసనసభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం

వరంగల్: పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెంట్ పీరియడ్‌లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపరాదని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 29, 30న పత్రికల్లో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనల జారీ కోసం ముందస్తుగా జిల్లా కేంద్రంలోని ఎంసీఎంసీ కమిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలీసులు నిర్వర్తించాల్సిన విధులపై సోమవారం పోలీస్ అధికారులతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. డీసీపీలు రవీందర్, అబ్దుల్‌బారి, సీతారాం, అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు అందించాలి

విద్యారణ్యపురి : ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్లు అందించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మనోజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాజ్యాంగబద్ధంగా లభించిన ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఈనెల 27, 28 తేదీలతోపాటు అవసరమైతే డిసెంబర్ 1,2 తేదీల్లో కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోలింగ్ మరుసటిరోజు డిసెంబర్ 1న సెలవు మంజూరు చేయాలని ఆయన సూచించారు.